క్లుప్తంగా

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



జి.కొత్తపల్లిలో కుళాయి కనెక్షన్‌కు గొయ్యి తవ్వుతున్న కార్మికులు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి ప్రతిఒక్కరికీ రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గజ్జనపూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు సూచించారు. మండలంలోని గజ్జనపూడిలో ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఘర్షణలు, విద్వేషాలకు తావులేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ కుల రహిత సమాజ స్థాపనకు పాటుపడాలన్నారు. దొంగతనాల నివారణ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, రోడ్ ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాలివాహన అభివృద్ధి కమిటీ జిల్లా సభ్యుడు అనకాపల్లి నూకరాజు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, జెడ్పీ స్కూల్ పీఎంసీ చైర్మన్ బర్ల లోవరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడ్వకేట్ బుగత శివ

ఏలేశ్వరం: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ అన్నారు. మండలంలోని యర్రవరంలో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నేరమన్నారు. కొందరు మహిళలు, బాలికలను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చారు మజుందార్ పోరాటాలు స్ఫూర్తిదాయకం

జగ్గంపేట: నక్సల్ బరీ ఉద్యమ నేత చారు మజుందార్ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నేత జక్కంపూడి రాజు అన్నారు. మండలంలోని గోవిందపురంలో ఆదివారం చారు మజుందార్ వర్ధంతిని నిర్వహించారు. తొలుత చారు మజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమను కొనియాడారు. పలువురు లిబరేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైవేపై రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇ.రామకృష్ణ మండలంలోని తాళ్లూరు శివారు దాబా వద్దకు వచ్చేసరికి మోటార్ సైకిల్ ఎడమ వైపు హ్యాండిల్ విరిగిపోవడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడుకి రోడ్డు సేఫ్టీ అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రామయ్యపాలెంలో మహిళా శక్తి ప్రచార రథయాత్ర

గండేపల్లి: మండలంలోని రామయ్యపాలెంలో ఆదివారం టీడీపీ శ్రేణులు మహిళా శక్తి ప్రచార రథయాత్ర నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటికీ వెళ్లి మినీ మేని ఫెస్టోలో ప్రకటించిన పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు పోతుల మోహన్‌రావు, పాలచర్ల సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇక పక్కా.. ఓటర్ల లెక్క



సోమవరంలో ఓటరు వివరాలను పరిశీలిస్తున్న ఆర్‌ఓ సుధారాణి, తహసీల్దార్ మాధవరావు



చిల్లంగిలో ఇంటింటా సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

- ఇంటింటా సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు
- కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశం
- వచ్చే నెల 21 వరకూ కొనసాగనున్న సర్వే

మండలంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
కిర్లంపూడి	27127	26855	53985

కిర్లంపూడి: మీ ఓటు ఎక్కడ ఉంది ? చిరునామా మార్చాలనుకుంటున్నారా ? ఒకే ఇంటో పదుల సంఖ్యలో ఓట్లు ఉన్నాయా ? 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు కాలేదా ? ఇలాంటి ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఓటర్ల సంక్షిప్త జాబితా సవరణ ప్రక్రియకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

మరింత కచ్చితంగా

ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓ) వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. సవరణలతో పాటు ఫొటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటర్ ఆమోదంతో చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు మరో 9 నెలల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు చెప్తున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేసి 2024 జనవరి 5న తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. దీంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి.

బీఎల్‌ఓలకు రిజిస్టర్లు, దరఖాస్తులు

ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ నెల 21న ప్రారంభమైన ఇంటింటా సర్వేలో పాల్గొనే బీఎల్‌ఓల చేతికి ఓటు సవరణకు సంబంధించి రిజిస్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు(ఫారం-6), ఓటు తొలగింపునకు (ఫారం-7), నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీకి(ఫారం-8) దరఖాస్తులను జిల్లా యంత్రాంగం అందించింది. ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. సవరణ పక్కాగా చేపట్టేందుకు బీఎల్‌ఓలు ఓటరు యాప్ (వెర్షన్ 4.7)ను ఇన్‌స్టాల్ చేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సినవారు దరఖాస్తు నింపి, బీఎల్వోలకు అందించాలి. ఒకే కుటుంబంలో ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్‌కు అనుసంధానించేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడుతుంది.

విస్తృతంగా అవగాహన

ఓటర్ల సవరణ ప్రక్రియపై ప్రజలకు అధికార యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతో పాటు బీఎల్‌ఓలకు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కూడా అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలని అధికారులు రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లను కోరుతున్నారు.

ఓటు సరి చూసుకోవాలి



ఇంటింటా సర్వేను ఓటర్లు సద్వినియోగపర్చుకోవాలి. బీఎల్‌ఓలు ఇంటికి వచ్చినప్పుడు ఓటరు ఐడీ కార్డులు, పేరు, చిరునామా, వయస్సు, ఆధార్, ఇతర వివరాలు సరిచూసుకోవాలి. ఫొటో చక్కగా లేకపోతే అక్కడిక్కడే ఫొటోను అప్‌డేట్ చేసుకోవాలి. తప్పులు సరిదిద్దేందుకు అవసరమైన ఆధారాలను బీఎల్వోలకు సమర్పించాలి. ప్రక్రియ సజావుగా, గడువులోగా పూర్తియ్యేందుకు బీఎల్వోలకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలి.

సుధారాణి, ఈఆర్‌ఓ, కిర్లంపూడి మండలం

కనకదుర్గ అమ్మవారికి చండీహోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దిగువన కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల' సందర్భంగా ఆదివారం అమ్మవారికి చండీ హోమం, ప్రత్యేక పూజలు, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్, గంగాధరబట్ల శర్మ, ప్రయాగ రాంబాబు, నర్సింహమూర్తి, చెల్లపిళ్ల ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తలుపులమ్మను దర్శించిన న్యాయశాఖ కార్యదర్శి



తలుపులమ్మ అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకరరావు

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకరరావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆదివారం దేవస్థానానికి వచ్చిన ఆయనకు వేదపండితులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్య ప్రభాకరరావు, అతని కుటుంబ సభ్యులు బాలాలయంలో అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం వేద పండితులు వారికి ఆశీస్సులు అందజేయగా అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటాన్ని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు అందజేశారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు



పాండుదొర దంపతులను సత్కరించిన బ్యాంక్ సిబ్బంది

గోకవరం: ఉద్యోగులకు సేవలే గుర్తింపును ఇస్తాయని గోకవరం స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ దేవికా రాణి అన్నారు. గోకవరం స్టేట్ బ్యాంక్ బ్రాంచ్‌లో సీనియర్ హెడ్ మెసెంజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కర్రిం పాండుదొర దంపతులను ఆదివారం బ్యాంక్ సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు. పాండుదొర సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హేమసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

జగ్గంపేట: మండలంలో కాట్రావులపల్లిలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కాట్రావులపల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ శిబిరంలో ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

గేదెను ఢీకొట్టిన కారు

పిఠాపురం: పిఠాపురం-కత్తిపూడి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు గేదెను ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు వస్తున్న కారు భోగాపురం రోడ్డు జంక్షన్ సమీపంలో పొలాల్లోంచి రోడ్డు మీదకు వస్తున్న గేదెను ఢీకొట్టింది. గేదె గాయపడగా కారులో ప్రయాణిస్తున్న వారికి త్రుటిలో ప్రమాదం తప్పింది.

ప్రమాదకరంగా వంతెనలు



రౌతులపూడి-కత్తిపూడి రోడ్డులో అంగడాల గెడ్డపై ప్రమాదకరంగా ఉన్న వంతెన



శిథిలావస్థలో ఉన్న తాండవ బ్రిడ్జి

రౌతులపూడి: రౌతులపూడి-కత్తిపూడి రహదారిలో బంగారయ్యపేట వద్ద అంగడాల గెడ్డపై వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన దీర్ఘకాలంగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలస్థితికి చేరింది. అసలే ప్రమాదకరమైన మలుపు ఆపై వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ (రక్షణ గోడలు) కూలిపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వంతెన మీదుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేక పర్యాయాలు ఆర్ అండ్ బీ అధికారులు ఈ వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కోటనందూరు: స్థానిక తాండవ కాజ్‌వే (బ్రిడ్జి) ప్రమాదకరంగా మారింది. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి పైభాగంలో గుంతలు పడడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు బ్రిడ్జిపై నిలిచిపోయి రాకపోకలకు విఘాతం కలుగుతోంది. వర్షాల సమయంలో ద్విచక్ర వాహనదారులు ఈ బ్రిడ్జిపై ప్రమాదాలకు గురవుతున్నారు. బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండడంతో తుపానులు వస్తే తుని-నర్సీపట్నం రోడ్డు, కోటనందూరు గ్రామానికి సంబంధాలు తెగిపోతున్నాయి. కోటనందూరు, రౌతులపూడి, నాతవరం మండలాల్లోని 50 గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పొర్లుకట్టు చెక్‌డ్యాం శిథిలం



ఎ.మల్లవరం ఎర్రచెరువు సమీపంలో అధ్వానంగా ఉన్న చెక్ డ్యాం

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం ఎర్రచెరువు పొర్లుకట్టు చెక్ డ్యాంను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. సుమారు 200 ఎకరాలకు ఈ పొర్లుకట్టు ద్వారానే సాగునీరు అందేది. నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కట్టు దిగువ భాగంలో మట్టి కొట్టుకుపోవటంతో చెరువులోని నీరంతా వృథాగా పోతోంది. దీంతో ఆయకట్టు శివారు భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి పొర్లుకట్టు చెక్‌డాంను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

అసంపూర్తిగా.. అలంకార ప్రాయంగా..



ఎ.మల్లవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఐదేళ్లుగా భవనం నిర్మాణం చేపట్టకపోవటంతో అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇరుకైన అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ చేపట్టడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసినా భవనం శ్లాబ్ వరకే నిర్మాణం చేపట్టారు. మిగిలిన పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఏళ్ల తరబడి భవన నిర్మాణం నిలిచిపోవడంతో భవనం చుట్టూ తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అంతేగాకుండా ఈ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మణిపూర్ అల్లర్లకు నిరసనగా ర్యాలీ



జగ్గంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

జగ్గంపేట: మణిపూర్‌లో అల్లర్లు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా జగ్గంపేటలో ఆదివారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జగ్గంపేట మెయిన్ సెంటర్ నుంచి గోకవరం రోడ్డు వరకూ ర్యాలీ చేశారు. ప్లకార్డులతో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జాన్ వెస్లీ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను ఖండిస్తున్నామన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాలని కోరారు. పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కుట్టుమెషీన్ శిక్షణ

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని పెద్ద శివాలయం ఎదురుగా ఉన్న బచ్చు రామేశం సత్రంలో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టుమెషీన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సత్రం చైర్మన్ పైండా రామకృష్ణరావు ఆదివారం తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి 1 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలకు మహిళలకు అనుభవజ్ఞులైన వారితో శిక్షణ ఉచితంగా ఇస్తున్నామన్నారు. కాకినాడ నగరం పాటు పరిసర గ్రామాలకు చెందిన మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు



నాట్లు వేస్తున్న కూలీలు

- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ
- అనుకూలించిన వాతావరణం
- వర్షాలతో ఊపందుకున్న పనులు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు నియోజకవర్గవ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీజన్ ప్రారంభంలో వర్షాలు తక్కువగా పడడంతో రైతులు దిగాలు చెందారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి విస్తారంగా వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో దమ్ములతో పాటు వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

21 వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గవ్యాప్తంగా ఈ ఏడాది 21 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేయనున్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు ఆశించిన స్థాయిలో పడడంతో నాట్లను వేగవంతం చేశారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ ఏడాది సాగు ఆలస్యమయ్యింది.

కూలీల కొరత

వర్షాలకు అన్ని గ్రామాల్లోనూ ఒకేసారి నాట్లు వేయడంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది. కూలి రేట్లు పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. రైతులు పెట్టుబడి తగ్గించుకొనేందుకు వెదజల్లు, డ్రమ్ముసీడర్ విధానాలను వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వెదజల్లు విధానంతో పెట్టుబడి తగ్గడంతో పాటు పది రోజుల ముందే పంట చేతికి వస్తుందని చెబుతున్నారు. రైతులు ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచిస్తున్నారు.

కలిసొచ్చిన రైతు భరోసా కేంద్రాలు

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు కలిసొస్తున్నాయి. కేంద్రాల్లోని కియోస్కో యంత్రాల ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను పొందుతున్నారు. గతంలో రైతులకు విత్తనాలు సిద్ధం చేసుకోవడం తలకుమించిన భారంగా ఉండేది. ప్రస్తుతం అన్ని ఆర్‌బీకేల్లోనూ విత్తనాలు అందుబాటులో ఉండడంతో రైతులు ఉత్సాహంగా సాగు చేస్తున్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ప్రస్తుతం ఖరీఫ్ పనులు ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాము. ఆర్‌బీకేల సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు సాగుపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– జ్యోతి, మండల వ్యవసాయాధికారి, ఏలేశ్వరం

మరిడమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు



మరిడమ్మ ఆలయం వద్ద భక్తుల కిటకిట

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతరలో భాగంగా శ్రావణ మాసం మొదటి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్‌ఐ వెలుగుల సురేష్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

పులిహోర, పాలు పంపిణీ

స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

ఖురాన్ పఠన పోటీలు

కాకినాడ సిటీ: నగరంలోని జె.రామారావుపేట మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మద్రాసా అరబియా హాబిబిలో చదువుతున్న పిల్లలకు ఖురాన్ పఠనం పోటీలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన పిల్లలకు ఆదివారం బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అబ్దుల్ బషీరుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం పిల్లలు ఇస్లాం మూలాలను, ఖురాన్ చదవడం నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. హాజీ మదీన, నగూర్ వలీ, అక్బర్ ఖాన్, వలిబాసా తదితరులు పాల్గొని 120 మంది పిల్లలకు బహుమతులు అందజేశారు.